




ప్రకాశం ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రదర్శన


ప్రజాశక్తి-కందుకూరు: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా కందుకూరు జెడ్‌పి హెచ్ గర్ల్స్ స్కూల్‌లో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు డీన్ డా. లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. మల్టీపర్పస్ స్ప్రేయర్, క్రాప్ సేవర్, స్మార్ట్ కూలర్, బయో గ్యాస్ జనరేషన్ వంటి వినూత్న ప్రాజెక్టులు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి.స్కూల్ ప్రిన్సిపల్ కె. ద్వారకారాణి కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపి, ఇటువంటి ప్రదర్శనలు స్కూల్ విద్యార్థులలో శాస్త్రసాంకేతిక అభిరుచిని పెంపొందిస్తాయన్నారు. స్కూల్ పీడీలు ఎం. రాజ్యలక్ష్మి, కె. ఆది లక్ష్మి ఈ ప్రదర్శన విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు.కరస్పాండెంట్ డా. కంచర్ల రామయ్య మాట్లాడుతూ, "ఇంజనీరింగ్ విద్యార్థులు, పరిశ్రమ నిపుణుల ప్రదర్శనలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో నూతన ఆలోచనలకు దారి తీస్తాయి ప్రదర్శనలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బి. వైష్ణవి, కె. వినయ్, సి. శంకర్, ఎం. విజయేంద్ర, యస్. కె షాహిద్, వి. శ్రీహరి, డి. సాయి శ్రీ, డి. మానిషా, వి. భాగ్యలక్ష్మి, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల చే ప్రదర్శన

ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో మొండిచేయి..!

◆సూపర్ సిక్స్‌కు కనిపించని చోటు
◆కేటాయింపులు ఘనం...ఆచరణే అనుమానం
◆పెద'వి'రుస్తోన్న ప్రతిపక్షాలు

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సాధారణ బడ్జెట్‌కు కేటాయింపులు ఘనంగా కనిపించాయి... అప్పులకు వడ్డీ కట్టలేకున్నామంటూ చెప్పుకొచ్చిన చంద్రబాబునాయుడు రూ. 3.22 లక్షల కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలు విషయంలో పెద్దగా శ్రద్ధ పెట్టినట్లు కనిపించలేదు. జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులో సోమశిల హైలెవల్ కెనాల్, పెన్నా డెల్టా ఆధునికీకరణ, వెలిగొండ ప్రాజెక్టులు అంతంత మాత్రంగానే కనిపించాయి. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు తక్కువ బడ్జెట్ కేటాయింపులు జరిగాయని ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి. సిపిఎం, వైసిపి, సిపిఐ బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేయగా, టిడిపి సంతృప్తి వ్యక్తం చేసింది...


సోమశిల ప్రాజెక్టు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో 2025-26 . బడ్జెట్ ప్రవేశపెట్టారు. రూ.3.22 లక్షల కోట్లు భారీ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. కేటాయింపులు భారీగా కనిపించాయి. గతేడాది రూ.2.94 లక్షల కోట్లు ప్రవేశపెట్టగా, రూ. 22 వేల కోట్లు పెంచి నూతన బడ్జెట్ పెట్టారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని చంద్రబాబునాయుడు పదేపదే చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఇంత పెద్ద బడ్జెట్‌పై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో తల్లికి వందనం మాత్రమే అమలుచేస్తామని బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రూ.12,300 కోట్లు కావాల్సి ఉండగా కేవలం రూ.9407 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమానికి పెద్ద ఎత్తున కేటాయింపులు చేశారు. గృహ నిర్మాణానికి రూ.6318కోట్లు కేటాయించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తిచేసుకొని ప్రారంభం కాకుండా నిలిచిపోయిన గృహాల కోసం కేటాయించారా. లేదా కొత్తగా ఏమైనా అమలు చేస్తారో చూడాల్సి ఉంది. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్దగా కేటాయింపులు కనిపించలేదు. పెన్నా డెల్టా ఆధునికీకరణకు రూ.35.76 కోట్లు, పెన్నా పొర్లుకట్ట, కృష్ణా పొర్లుకట్టకు కేవలం రూ.3.83 కోట్లు కేటాయించారు. సోమశిల హైలెవల్ కెనాల్ కనిపించలేదు. ప్రకాశం, నెల్లూరు జిల్లాకు ఎంతో ఉపయోగమైన వెలిగొండ ప్రాజెక్టులకు నిదులు కేటాయింపులు ఎక్కడా ప్రస్తావన లేదు. ఉచిత బస్సు ప్రస్తావన ఇప్పట్లో అమలు జరిగేలా లేదు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, వంటి కీలక పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు కనిపించలేదు. బడ్జెట్ చూడడానికి బడాయిగా ఉన్నా, ఆచరణపై అనుమనాలున్నాయి. ఇందుకు ప్రధాన కారణంగా అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రంలో ఇంత భారీ బడ్జెట్ సాధ్యమా అనే అనుమానాలు కలుగుతున్నాయి.



రైతులను విస్మరించారు
మూలం రమేష్ సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, కౌలు రైతులు విషయంలో స్పష్టత కనిపించడం లేదు. వ్యవసాయ రంగానికి రూ. 48 వేల కోట్లు కేటాయించారు. కౌలు రైతులను పట్టించుకోవాలి. అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్రం ఇచ్చిన ఆరువేలను కలుపుకొని ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాపితంగా కౌలు రైతుల సంఖ్యకు ప్రభుత్వ కేటాయింపులకు పోలికలేకుండా ఉంది. జిల్లాలోని ప్రధానమైన సోమశిల హైలెవల్ కెనాల్, వెలిగొండ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపుల్లో అన్యాయం జరిగింది.



బాబు సూపర్ సిక్స్ మరిచారు
కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైసిపి జిల్లా అధ్యక్షులు

గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఊరూరు తిరిగి సూపర్ సిక్స్‌అమలు చేస్తామని ప్రచారం చేశారు. బడ్జెట్‌లో ఎక్కడా ఆ ఊసే కనిపించడం లేదు. ఉచిత బస్సును అటకెక్కించారు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే తీసుకురాలేదు. తల్లివందనం కార్యక్రమానికి పిల్లల సంఖ్యను బట్టి రూ.12,300 కోట్లు కావాల్సి ఉంటే తూతూ మంత్రంగా రూ.9407 కోట్లు కేటాయించారు. దీపం పథకం కింద 1.57 కోట్ల మంది మహిళలు అర్హత ఉంటే, 97 లక్షల మందికి కుదించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల ఏమైపోయాయి. ఇచ్చిన హామీలు మరిచిపోయి, అందుకు నిధులు కేటాయించకుండా కాకి లెక్కలు బడ్జెట్‌లో చూపించారు.



ఇది ప్రజల ఆకాంక్షల బడ్జెట్
ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు అనుకూలంగా ఉంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చేలా కనిపిస్తోంది. సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు చేశారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. ఇరిగేషన్‌కు రూ.18 వేల కోట్లు కేటాయించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు భారీగా నిధులు కేటాయించారు. అప్పులు మిగిలిన రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు దూర దృష్టితోనే మంచి బడ్జెట్ తీసుకొచ్చారు.



అంకెల గారడి బడ్జెట్
దామా అంకయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా కనిపిస్తోంది. అప్పుల రాష్ట్రంలో రూ.3.22 లక్షల కోట్లు పెట్టి ఎవరిని మభ్యపెట్టడానికి చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన బడ్జెట్‌కు సంఖ్యలు మార్చి, అంకెల గారడి చేసినట్లు కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు పెద్దగా ప్రస్తావించలేదు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-నెల్లూరు

ఆప్కాస్ రద్దు చేస్తే, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అందుకు విరుద్ధంగా ప్రభుత్వం ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆప్కాస్ రద్దు చేసి, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నగరంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆప్కాస్‌లోని అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాసు రద్దు చేసి, ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు.ఈ తీర్మానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో మున్సిపల్ కార్మికులకు కాంట్రాక్టు, దళారీ వ్యవస్థ ఉండడం వలన సక్రమంగా జీతాలు అందేటివి కావన్నారు. రెండు, మూడు నెలలకు ఒకసారి ఇచ్చేవారు, ఉద్యోగ భద్రత ఉండేది కాదు. దీని వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మధ్య దళారులు లేకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆప్కాసు విధానం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. దీనివలన మున్సిపల్ కార్మికులకు ఒకటో తేదీన జీతాలు ఉద్యోగ భద్రత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఈ విధానం రద్దు చేసే ఆలోచన చేస్తే అంతకంటే మెరుగైన వ్యవస్థను తీసుకుని రావాలి, అంతే తప్ప మరలా కాంట్రాక్టర్లకు అప్పజెప్పతామని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తారని, దశల వారీగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తారని మున్సిపల్ కార్మికులు ఎంతగానో ఆశించారన్నారు. కానీ మరలా పాత వ్యవస్థని తీసుకొని వస్తామని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామని చెప్పడం అంటే మున్సిపల్ కార్మికులను ఇబ్బందులకు గురి చేయడమే అన్నారు. రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆప్కాస్ రద్దు చేస్తే, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. దర్నా అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, నాయకులు అశోక్, సుజాత, వజ్రమ్మ, భాగ్యమ్మ, కొండమ్మ, శ్రీనివాసులు, బాలు, కొండమ్మ, చెన్నయ్య, మారుతి, సలోమి, డానియేలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి-కందుకూరు

మార్చి 1నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్నీ గ్రామాలలో ఉచిత గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్ సుధాకర్ తెలిపారు. ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాప్తి చెందే పికర్నో విరిడే అనే వైరస్ వలన వస్తుంది కాబట్టి 4 నెలలు దూడలు నుండి పెద్ద పశువులకు ముందస్తు గా టీకాలు వేయించటం వలన వ్యాధిని నివారించవచ్చుని తెలిపారు. పశు పోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యులు డాక్టర్ ఎస్.సుధాకర్ తెలిపారు.


ఫిర్యాదు చేస్తున్న ఎంపిపి పెన్నా కృష్ణయ్య

ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-లింగసముద్రం

లింగసముద్రం మండలంలో ప్రజా పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశపూర్వకంగా జరగనివ్వకుండా ప్రయత్నం చేసి తప్పుడు దారి పట్టించిన ఎంపిడిఒ పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారికి ఎంపీపీ పెన్నా కృష్ణయ్య వినతిపత్రం అందజేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.సమావేశం నిర్వహించే ఎంపీడీఓ తగిన జాగ్రత్తలు చేపట్టకుండా సమావేశ మందిరంలోకి సంబంధం లేని వ్యక్తులు బలవంతంగా వస్తుంటే చూస్తూ ఉద్దేశపూర్వకంగా సమావేశం జరగకుండా ప్రయత్నించారు.ఆయన చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సి.ఈ.ఓను కలసి శుక్రవారం వివరించారు.ఈ సందర్భంగా సీఈఓ ఎంపీడీఓను ఫోనులోనే మందలిస్తూ ప్రజా ప్రతినిధులను పరిగణలోకి తీసుకొని పనిచేయాలని సమస్యను పెద్దది చేయకుండా పరిష్కరించాలని సూచించారు.అనంతరం జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అధికారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ లో పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పాల్గొన్న సమావేశంలో రసాభాస సృష్టించిన వ్యక్తులను,ఎంపీడీవో పై తగిన ఆధారాలతో శాసనమండలి చైర్మన్‌కు, ప్రివిలేజ్ కమిటీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రారెడ్డి పాలెం సర్పంచి డబ్బుకొట్టు మల్లికార్జున, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

బాడీ బిల్డర్ హలీంకు సత్కారం

ప్రజాశక్తి-కందుకూరు: ఎక్స్ ఫిట్నెస్ జిమ్ వరల్డ్ ప్రొప్రైటర్ బి శ్రీనివాసులు హోసిని వారి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా నేషనల్స్ లో పదో స్థానాన్ని దక్కించుకున్న కందుకూరు వాసి షేక్ కరిముల్లా కుమారుడు,షేక్ హలీంకి శుక్రవారం సన్మానం చేశారు.విజయవాడలో జరిగిన కాంపిటీషన్లో సెలెక్ట్ అయ్యి బాడీ బిల్డింగ్ విభాగంలో నేషనల్స్ లో70 మంది పాల్గొనగా వారిలో పదవ స్థానాన్ని దక్కించుకున్న షేక్ హలీం కందుకూరు వాస్తవ్యుడు కావటం కందుకూరు కే గర్వకారణంమని సన్మానించిన వారన్నారు. హలీంకు ఇంకా ఎన్నో ర్యాంకులు రావాలని అందరి చేయూత మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్యవైశ్య ప్రముఖుల సమక్షంలో ఘనంగా సన్మానించడం జరిగింది.జిమ్ అధినేత శ్రీను తన వంతుగా 10 వేల రూపాయల పారిదోషికాన్ని హలీంకు ప్రకటించారు. ప్రభుత్వం కూడా హలీం ను గుర్తించి తగువిధంగా చేయూత అందించాలని ఈ కార్యక్రమామంలో ఆర్యవైశ్య నాయకులు చెక్క కేశవరావు,కోత్తూరి సుధాకర్,చీదెళ్ళ వేణుగోపాలరావు, మురారిశెట్టి శ్రీకాంత్, పబ్బిశెటి శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అభివృద్ధి కమిటి నాయకులు

కందుకూరు కోర్టు పరిధిని కుదించడం సరికాదు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిని కుదిస్తూ హైకోర్టు ఆదేశాలను జారీ చేయడం మంచిది కాదని అభివృద్ధి కమిటీ అభిప్రాయపడింది.కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఈ విషయాలపై సమావేశంలో కోర్టు పరిధి కుదించడం అశాస్త్రీయమని అభిప్రాయ పడింది. .కందుకూరు కోర్టు పరిధిలోని పొన్నలూరు, కొండపి, జరుగుమల్లి, సింగరాయ కొండ మండలాలను ఒంగోలు కోర్టు పరిధిలో చేర్చడం సబాబుకాదని కమిటీ తెలిపింది. దీనివల్ల కక్షిదా రులు తీవ్రఇబ్బందులు పడతారని కమిటీ తెలిపింది. .దీనికి కారణం రెండవ అతిపెద్ద రెవెన్యూ డివిజన్ అయిన కందుకూరును నెల్లూరు జిల్లాలో కలపడం, కందుకూరు డివిజన్ పరిధిని ఏడు మండలాలకి కుదించడం కారణంగా ప్రకాశం జిల్లాలో నిలిచిపోయిన పై మండలాలను ప్రకాశం జిల్లా కు చెందిన ఒంగోలుకు తరలించినట్టుగా భావించాల్సి వస్తుందన్నారు. .కందుకూరు నెల్లూరుకు దాదాపుగా 120 కిలోమీటర్ల దూరం ఉంది. పొన్నలూరు, కొండపి ,జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు కు 40 నుండి 50 కిలోమీటర్ల దూరం 60 కిలోమీటర్ల దూరం ఉన్నది .అదే కందుకూరు కు ఈ మండలాలు అత్యంత సమీపంలో ఉన్నవి. జిల్లా మారిన కారణంగానే సుదూరమైన నెల్లూరుకు కందుకూరుని మార్చిన కారణంగా ఈ దుస్థితి ఏర్పడిందని కందుకూరు కమిటీ అభిప్రాయపడుతుందని వారు తెలిపారు.. జిల్లా మార్పు కోసం ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమం నిర్మించి తాడోపేడో తేల్చుకుంటామని కందుకూరు అభివృద్ధి మండలి స్పష్టం చేసింది. అభివద్ధి మండలి అధ్యక్షులు డాక్టర్ దివి శివరాం ఆదేశానుసారం నిర్వహించబడిన ఈ సమావేశంలో మండలి ఉపాధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు, కన్వీనర్లు పులిచెర్ల వెంకటసుబ్బారెడ్డి, తోకల వెంకటేశ్వర్లు, నరేష్ రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు

జిల్లావ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో గ్రామాలవారీగా రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు.గూడ్లూరు మండలంలో గుడ్లూరు-1, దరకనిపాడు,కందుకూరు మండలంలో మోపాడు, మహదేవపురం, ఓగూరు, పలుకూరు,లింగసముద్రం మండలంలో చినపావని, మొగిలిచర్ల, తూనుగుంట, ఎర్రారెడ్డిపాలెం,ఉలవపాడు మండలంలో ఉలవపాడు, చాగొల్లు,వలేటివారిపాలెం మండలంలో పోకూరు, వలేటివారిపాలెం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు సంబంధించి సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.రైతులందరూ ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



విరాళం అందజేత

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ :మండలంలోని చెమిడిదపాడు బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం కోసం చెమిడిదపాడు గ్రామానికి చెందిన చిత్తూరు నాగ సుబ్రహ్మణ్యం ధర్మపత్ని మంజుల కుమారుడు నాగ పార్ధు 5వేల రూపాయల విరాళం ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు కు ఫోన్ పే ద్వారా పంపారు. ట్రస్ట్ తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశా లలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ చెరుకూరు సరళ, ఉప స ర్పంచ్ చావా సుధారాణిలు హాజర య్యారు. ఈ సందర్భంగా వారు వి ద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్ర దర్శనను తిలకించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించా రు. కార్యక్రమంలో ఎస్ఎంసి వైస్ చైర్మన్ వి. గిరిజ కుమారి, పాఠశాల ఉపా ధ్యాయులు కె.వసంత లక్ష్మి, కె. హె ప్సీ విద్యుల్లత, బి. కష్ణవేణి విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కొండాయపాలెం స్కూల్

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో శుక్రవారం ఘనంగా సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు రకరకాల ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు మాట్లాడుతూ బాల్యం నుంచే పరిశీలన శాస్త్రీయ దక్పథం విద్యార్థులకు అవసరం అన్నారు. అనంతరం సైన్స్ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


క్రాంతి స్కూల్లో

క్రాంతి నగర్ స్కూల్లో
ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని దర్గామిట్ట (క్రాంతి నగర్) నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులు తమ ఆలోచనలు కనుగొనగా 50 విజ్ఞాన నమూనాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరిని ఇవి ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా క్రాంతి నగర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కొమ్మల కష్ణయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు దీప్తి ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్ డబ్ల్యు ఓ ఖాసీం సార్, బషీర్, రఘు, గురుమూర్తి , జయలక్ష్మి ,గౌసియా, సుజాత లక్ష్మీ పాల్గొన్నారు


సిద్ధార్థలో


సిద్ధార్థలో
ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జి రామారావు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కరస్పాండెంట్ రామారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన జరుపుకుంటామన్నారు. రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన చంద్రశేఖర వెంకట రామన్ తన పరిశోధన ఫలితాన్ని ధ్రువీకరించిన రోజు ఫిబ్రవరి 28. దీంతో ఆ రోజునే నేషనల్ సైన్స్ డే జరుపుకోవాలని 1987లో భారత ప్రభుత్వం ప్రకటించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు హరిబాబు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న డాక్టర్ నాయక్

జెవివి ఆధ్వర్యంలో

జాతీయ సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞానవేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యాలయం (జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం) వద్ద ఉదయం 7గంటలకు సంస్థ జెండా ఆవిష్కరణ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి చలపతి చేశారు. అనంతరం నగరంలోని ఆర్.ఎస్.ఆర్.హైస్కూలు, జాకీర్ హుస్సేన్ నగర్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలు వీక్షించారు. కార్యకర్తలు సీసా పెంకులపై నడవడం, ఇనుప మేకులపై కాలుమోపడం వంటి కార్యక్రమాలు చేశారు. సాయంత్రం చిల్డ్రన్ పార్క్ వద్ద నెల్లూరు సైన్స్ సెంటర్ వారి సహకారంతో ఆకాశంలో అరుదుగా సంభవించే "గ్రహాల వరుస" అద్భుతాలు టెలిస్కోప్ వీక్షించుటకు ప్రజలకు, విద్యార్థులకు అవకాశం కలిగించి, వివరించారు.


నాగార్జున స్కూల్లో

నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లో
ప్రజాశక్తి-కందుకూరు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కందుకూరు పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్లో సైన్స్ ఫెయిర్ ను ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కెవి రమణారెడ్డి రిబ్బన్ కట్ చేసి సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పదోనోపాధ్యాయులు డి బాలబ్రహ్మం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఇఒ కె. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలం అలవడుతుందన్నారు. సైన్స్ ఫేర్వెల్ లో నాగార్జున స్కూల్ అన్ని తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ విషయాలు విజ్ఞానదాయకంగా ఉన్నాయని తెలిపారు. ఆహుతులను, తల్లిదండ్రులను ఎంతోగానో ఆకర్షించాయి. కార్యక్రమంలో నాసా సైంటిస్ట్ జి.శబరిస్, డైరెక్టర్ వి.మర్రెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, సునీల్, పి. శ్రీనివాసరావు, సుహాసిని, సి. హెచ్. రమేషు, మల్లీ ,బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఆర్‌ఆర్‌లో

కందుకూరు టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం , జీవశాస్త్ర విభాగ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.రవికుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, భౌతిక శాస్త్ర అధ్యాపకులు కష్ణ శర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర విభాగం వారు ఎగ్జిబిషన్ ను నిర్వహించారు.కార్యక్రమంలో అధ్యాపకులు బి.కమల బాబు, డాక్టర్ పద్మావతి, ఏ.హనుమంతరావు, డాక్టర్ తిరుపతి స్వామి, డాక్టర్ అనూష, ఎం.జ్యోతి, కె.శ్రీనివాసులు, జి.బ్రహ్మయ్య , ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


కస్తూరి దేవి స్కూల్లో

ప్రజాశక్తి-నెల్లూరు

కస్తూరిదేవిస్కూల్లో శుక్రవారం ఘనంగా సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థినులు రకరకాల ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కామేశ్వరి మాట్లాడుతూ బాల్యం నుంచే పరిశీలన శాస్త్రీయ దక్పథం విద్యార్థులకు అవసరం అన్నారు. అనంతరం సైన్స్ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థినుల దరికీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్స్ పాల్గొన్నారు.

బాలుర పాఠశాలలో
ప్రజాశక్తి-కందుకూరు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎం నరసింహమూర్తి సార్ సివి రామన్ చిత్రపటానికి పుష్పమాలను అలంకరించి ఉపాధ్యాయులందరూ కూడా ఘనంగా నివాళు లర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు.కార్యక్రమంలో షేక్ సంధాని భాష, ఐ శ్రీనిధి , సీనియర్ ఉపాధ్యాయులు వై. మహల్యారావు, మాధవరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ తలపనేని శ్రీనివాసులు, పెరుగు ప్రసాదు, రాంబాబు, మురళీకృష్ణ, బాపయ్య , ఇతర ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పి4 సర్వేను వేగంగా పూర్తి చేయాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పి4 సర్వేను మార్చి 3 లోపు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ సిబ్బందిని ఆదేశం చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం మండలంలో నిర్వహిస్తున్న ఈ సర్వే అందరూ సచివాలయ సిబ్బంది క్లస్టర్ వారీగా పూర్తి చేయాలన్నారు. నువ్వూరుపాడు సచివాలయ పరిధిలోని అశ్వినీపురం గ్రామంలో శుక్రవారం జరుగుతున్న పి4 సర్వేను ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సర్వే ఆధారంగా ఇంకను పేదరికంలో ఉన్న 20శాతం ప్రజల జీవనోపాధులు మెరుగుపరచడంలో తగిన ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అశ్వినీపురంలో వెరిఫికేషన్ కార్యక్రమంలో ఎంపిడిఒతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ రవూఫ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో ఈడీ సందర్శన



ప్రజాశక్తి-మర్రిపాడు : పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు శుక్రవారం డిసిపల్లి పొగాకు బోర్డును సందర్శించారు. గత 7 సంవత్సరాలు పొగాకు బోర్డులో వివిధ హోదాలలో పనిచేసి, బదిలీ అవుతున్న సందర్భంగా డిసిపల్లి పొగాకు బోర్డు రైతులు ఘనంగా సన్మానించారు. పలువురు రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేసిన మంచి పనులను కొనియాడారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ పొగాకు రైతులకు సేవ చేసుకునే అవకాశం దొరికినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణ అధికారి (ఆక్షన్స్) వి.రామాంజనేయులు, డిసిపల్లి వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతు నాయకులు గాలి నరసప్పనాయుడు, ఆరికట్ల జనార్ధన్ పాల్గొన్నారు.

మంచి బడ్జెట్ : టిడిపి

ప్రజాశక్తి-ఉదయగిరి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రాంతాల సంక్షేమానికి పెద్దపీటపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ బడ్జెట్ బడుగు బలహీన వర్గాల సంక్షేమ బడ్జెట్‌గా అభివర్ణిస్తూ ఎన్నికల్లో వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్లో నిధులు కేటాయించడం మంచి పరిణామంమని సంతోషం వ్యక్తం చేశారు.

నిందితురాలి అరెస్టు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని పాటూరు రోడ్డులో గురువారం సాయంత్రం నెల్లూరు టైలర్స్ కాలనీకి చెందిన టి.వాసుకి మూలాపేటకు చెందిన డి.జీవితలు ఎ.సతీష్‌కుమారి అనే ఆమె కళ్ళల్లో కారంకొట్టి బంగారు చైన్ అపహరించుకు పోయిన కేసులో వారిరువురిని స్థానికుల సాయంతో పట్టుకుని కోవూరు పోలీసులకు అప్పగించారని, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచడం జరిగిందని కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. ఈ కేసు విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ట్రైనీ డిఎస్పీ ఎ.శివప్రసాద్, కోవూరు క్రైం పార్టీ సిబ్బందిని నెల్లూరు డిఎస్పీ శ్రీనివాస్ అభినందించి రివార్డు కోసం సిఫారసు చేశారు.

సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు చేపడుతున్న వివిధ సర్వేలను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి ఆదేశించారు. కోవూరు మండలం చేగాని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని మండల విద్యుత్ అధికారి జడ రాయ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగోలు మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పాడైన ఫిర్యాదులు రావడంతో శుక్రవారం కోవూరు పల్లి, కొత్తూరు, కడనూతల, జక్కుపల్లి గూడూరు గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలను అమర్చామని తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని అప్పసముద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కీటక జనిత వ్యాధులు, కేన్సర్, పోషకాహారం, పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆటిసం, డ్రైడే-డ్రైడే, అమ్మవారు వ్యాధులపై గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కేసపాటి వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.జి. నౌషద్ బాబు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఆరోగ్య సిబ్బంది గోర్ల వెంకటేశ్వర్లు, సురేష్, పద్మావతి, మస్తాన్ అలీ, ఆశా కార్యకర్తలు ఆశ, ఎస్తేరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'హోమ్ ట్రయాంగిల్' యాప్ సేవలను పొందండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మెప్మా టీం వారి "హోమ్ ట్రయాంగిల్" యాప్ ఆన్‌లైన్ సేవలను పొందాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా సంస్థ నిర్వహించిన "హోమ్ ట్రయాంగిల్" యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మెప్మా, ఎస్ఎఫిఎ సంయుక్తంగా స్థానిక సాంకేతిక నిపుణులకు ప్రాథమిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు సర్వర్, అంకయ్య పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో లక్కీడిప్ బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : ప్రయాణికులను ఆకర్షించడానికి ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో వారు ప్రారంభించిన పథకం విజయవంతంగా కొనసాగుతుందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. డాక్టర్ రామప్పాయి హాస్పిటల్ వారి సహకారంతో ప్రారంభించిన ఈ పథకం ప్రకారం బస్సులో ఒక పెట్టెను ఏర్పాటు చేశారు. బస్సులో ప్రయాణించిన వారు తమ టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబర్ వ్రాసి పెట్టెలో వేయాలని, నెలకు ఒకసారి లక్కీడిప్ ద్వారా ఒక్కరిని ప్రయాణికులను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేస్తున్నాం. మంగళవారం లక్కీ డిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి వారికి విలువైన చీరలు అందజేశారు. పెద్దపవని - లింగ సముద్రంరూటులో ఎస్‌కె నాయబ్ రసూల్, కొమ్మి - కొండా పురం రూటులో ఎం.సరోజినీ దేవి, ఆల్లూరు రూటులో జి.పద్మ బహుమతులు అందుకున్నారు. బహుమతులను అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పనా రెడ్డి బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, ఎడిసి ఎస్.మాల్యాద్రి తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామాల వారీగా రైతులకు అందుబాటులో వుండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పని చేస్తాయని ఆయన తెలిపారు. ఆత్మకూరు మండలంలో మహిమలూరు, నువ్వూరుపాడు, ఆత్మకూరు మున్సిపాలిటీ, వాసిలి, వెన్నవాడ, కరటంపాడు, బట్టేపాడు, ముదిగేడు, అప్పారావుపాలెం, బొయ్యలగుంట, సిహెచ్ వడ్డిపల్లి, అనంతసాగరం మండలంలో అనంతసాగరం-1, రేవూరు, దేవరాయ పల్లి బిట్-1, పడమటికంభంపాడు, వరికుంటపాడు, పాతాలపల్లి, చిలకలమర్రి, అనంతసాగరం-2, ఎఎస్‌పేట మండలంలో కొండమీద కొండూరు, పెద్దబ్బీపురం, గుడిపాడు, జమ్మవరం, శ్రీకొలను, గుంపర్లపాడు, అనుమసముద్రం, రాజవోలు, చిరమన, సంగం మండలంలో అన్నారెడ్డిపాలెం, సిద్దీపురం, పడమటిపాలెం, దువ్వూరు, వంగల్లు, మర్రిపాడు, తరుణవాయి, కొలిమిట్ల, పెరమన, సంగం-1, 3, మర్రిపాడు మండలంలో బూదవాడ, చీమవరం, బేమవరం, చేజర్ల మండలంలో చేజర్ల, కోటితీర్థం, మమడుగు, నాగులవెల్లటూరు, పాతపాడు, పెరుమాళ్లపాడు, తిమ్మాయపాలెం / పేడూరు, తూర్పుపల్లి, యామదల, యేటూరు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు సంసిద్ధంగా సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. రైతులందరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సోలార్ విద్యుత్ ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సూర్య ఘర్ బిజిలీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి అతి తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రటరీలకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 23వ డివిజన్ పడారుపల్లి,చలపతి నగర్, సుందరయ్య కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, ప్రజా ప్రతినిధులు, సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్ రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో కోల్ మాన్, పేస్ సెటర్స్ ఎం.ఎన్.సి కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన 26మందికి శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, అకాడమిక్ ప్రిన్సిపాల్ పి.వి.రావు, కళాశాల నాక్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అమరేంద్ర, కంప్యూటర్ లెక్చరర్ కబీర్, ఫిజికల్ డైరెక్టర్ తిరుపాల్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీఎస్ సాయిచేత వారిని అభినందించారు.

'ఆప్కాస్' రద్దు దారుణం

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెప్పాలని చూస్తోందని ఇది సరైన విధానం కాదని సిఐటియు నాయకులు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య పేర్కొన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం కావలి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ సన్నీవంశీకృష్ణకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రయివేటు కాంట్రాక్టర్లు ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సక్రమంగా జీతాలు ప్రతినెలా రాకుండా పిఎఫ్, ఇఎస్ఐ కార్మికుల ఖాతాలో ప్రతినెలా జమ అయిన పరిస్థితులు లేవన్నారు. కార్మికులు పోరాటాలు చేసి



సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నాలుగు, ఐదు నెలలకు జీతాలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. పని ఒత్తిడి, కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఉండేవని గత ప్రభుత్వం అప్కాస్‌ను ఏర్పాటు చేసి, మున్సిపల్ కార్మికులను నియమించడం జరిగిందని అప్పటి నుండి కార్మికులకు ప్రతినెలా జీతాలు పిఎఫ్, ఇఎస్ఐ ప్రతినెలా కార్మికుల ఖాతాలో జమవుతున్నాయన్నారు. ఇప్పుడు ఆ విధానాన్ని తీసేసి, గత విధానాన్ని మళ్లీ తీసుకురావాలని కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబునాయుడు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే కార్మికులకు మెరుగైన వసతులతో పాటు పర్మినెంట్ చేస్తారని ఆలోచించి కార్మికులు ఓట్లు వేసి గెలిపించారన్నారు. గెలిచిన తర్వాత పర్మనెంటు చేయకపోగా ఉన్న అప్కాస్‌నే తీసివేసి కార్మికులను ఇబ్బందులకు గురి చేయాలని చూడడం ఇది విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి వారిది కార్మికుల ప్రభుత్వమని నిరూపించుకోవాలని కోరారు. కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు దశల వారీ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. పోరాటాలు ద్వారానే కార్మికులు హక్కులు సాధించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.తిరుపాలు, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, జి మధుసూదన్ రావు, వై.కృష్ణయ్య యూనియన్ నాయకులు తురక సీనయ్య, బి.మహేష్, ఒంగోలు రమేష్, కె.బాబు, ఎం.పోలయ్య, ఎస్.ఆనంద రావు, క్రాంతి కుమార్, మహిళా నాయకులు రాజ్యలక్ష్మి, పి.చిన్నమ్మ, అనిత, జ్యోతి, సుకన్య, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్మి తిరుపతమ్మకు సాయం చేయండి..

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని విట్స్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న పేదింటి అమ్మాయి లక్ష్మీతిరుపతమ్మ కావలి రక్తకణాలు నిర్వీవం అవుతున్న వ్యాధితో బాధపడుతుందని, అనారోగ్యంతో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉందని దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించి, ఆదుకోవాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ కన్వీనర్ చాకలకొండ శారద విజ్ఞప్తి చేశారు. దాతలకు వీలైనంత ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు. వ్యాధి మొదటి స్టేజీలో ఉన్న ఇప్పుడు, తీవ్ర ఒళ్లు నొప్పులు, రెండవ స్టేజికి వెళ్తే, కిడ్నీస్ పాడవుతాయని, మూడవ స్టేజీలో గుండె దెబ్బతింటుందన్నారు. రాయవెల్లూరు సిఎంసిలో డాక్టర్ సతీష్ 5 నెలలకు ఒకసారి ట్రీట్ చేస్తారని, 5 నెలలకు రూ.50వేలు ఖర్చు అవుతుందన్నారు. మందులు – చికిత్సకు, మార్చి 20వ తేదీ వెల్లూరుకు వెళ్లాల్సివుందని తెలిపారు. రూ.50వేలు కట్టాల్సి వుంటుందన్నారు. ప్రాణభయంతో రోజుగడుపుతున్న లక్ష్మీ తిరుపతమ్మకు మనిషిలో దేవుడిని చూడగల దాతలు, సహృదయులు ముందుకు వచ్చి, ఆర్థిక సహాయం చేయాలని ఆమె ప్రార్థించారు. కావలి



మాట్లాడుతున్న చాకలికొండ శారదమ్మ

ఉమెన్ ఫోర్స్, కలయిక విజ్ఞానకేంద్రం ద్వారా తాము ఆర్థిక సాయం చేసే ప్రణాళికలో ఉన్నామన్నారు. తిరుపతమ్మ తల్లి వేముల ధనమ్మ ఫోన్ నెంబర్ 8106545298, ఫోన్‌పే చేయవచ్చని తెలిపారు. లేదా అమ్మాయికి నేరుగా కలసి ఇవ్వవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దగుమాటి.కృష్ణారెడ్డి ప్రత్యేక విన్నపం చేస్తూ, తమ స్వంత నిధుల నుండేగాక సిఎం సహాయ నిధి నుండి లక్ష్మీ తిరుపతమ్మ అనే పేద విద్యార్థినికి నెలవారీ వైద్య నిమిత్తం ఆర్థికసాయం చేయాలని ప్రార్థిస్తున్నానన్నారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా ప్రతి మనసున్న దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తిరుపతమ్మ ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముందుకు రవాలని శారదమ్మ కోరారు.

బడ్జెట్‌లో రైతులకు శూన్యం



ప్రజాశక్తి-ఉదయగిరి : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రైతు విరోధి బడ్జెట్ కేటాయింపులో సీతారామసాగర్ పెద్దిరెడ్డిపల్లి ప్రాజెక్టుల నిధుల ఊసే లేదని ఎపి రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రాజెక్టు రైతులకు సంతృప్తికరంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేల వైద్యం రైతులకు యువతి యువకులకు గత బడ్జెట్‌తో పోలిస్తే తీవ్ర నిరాశ మిగిల్చిందని వాపోయారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతుంటే ధరల స్థిరీకరణ పేరుతో రూ.300కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమని దయ్యబట్టారు. గడిచిన బడ్జెట్లో రూ.3వేలకోట్లు ఉన్న బడ్జెట్‌ను రూ.300 కోట్లకు కేటాయించడంపై రైతులకు తీవ్ర నిరాశ మిగిలించారు. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం 1600 కోట్లు ఇవ్వాల్సి ఉండగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు 11 వేల కోట్లు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో హంద్రీ నీవా గాలేరి నగరి వెలుగొండ వంశధార తదితర చెరువులు కుంటలు వాటికి బడ్జెట్ కేటాయింపు లేదన్నారు. ముఖ్యంగా మెట్టప్రాంత జీవనాడులైన సీతారామసాగర్ పెద్దిరెడ్డిపల్లి ప్రాజెక్టులకు బడ్జెట్లో ఊసే లేదన్నారు. ఇప్పటికైనా మెట్టప్రాంతంపై మంత్రులు ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో చర్చించి ఈ ప్రాంత ప్రజలను రైతులను ఆదుకునేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపు ఆదుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో మెట్టప్రాంత ప్రజలు రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు.

ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-కందుకూరు : ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి మా ఉపాధి కోల్పోయేలా చేస్తుంది అని, దానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించకపోతే ఉద్యమం తప్పదని ఎఐటియుసి అనుబంధ ఎపి విద్యుత్ మీటర్స్ యూనియన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి కుంచాల సిద్దయ్య హెచ్చరించారు. కందుకూరు సిపిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఫిబ్రవరి 4వ తేదీ చలో విజయవాడ పిలుపుతో తమ ఉద్యమం తీవ్రతరం చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, నియోజకవర్గ కార్యదర్శి ఆనంద మోహన్, ఇ.మాల్యాద్రి, శ్రీను, జె.రాము, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయలేదని ధర్నా

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గండవరపు శేషయ్య, ఎస్‌కె బాబు మాట్లాడుతూ పాటూరు, పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో రైతులు తాము పండించిన పంటను దళాకారుల ద్వారా అమ్ముకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పడం తప్ప ఆచరణలో కొనుగోలు జరగడం లేదన్నారు. గ్రామస్థాయిలో ధాన్యం ఆరబోసుకునేందుకు వీలు లేకపోవడంతో దళారులు చెప్పిన రేటు పుట్టి రూ.17 వేలకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికార పార్టీ ఏర్పాటు చేసిన



నిరసన ధర్నా చేపడుతున్న నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఇప్పటి వరకు మిల్లుల వద్ద బ్యాంక్ గ్యారెంటీ తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం నోటి మాటలు తప్ప ఆచరణలో ఏమీ జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నాజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, యు వి రమణయ్య, చాన్ బాషా, భాస్కర్, శ్రీనివాసరావు, విజయకుమార్, తదితరులున్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

ప్రజాశక్తి-బిట్రగుంట

విశ్వనాథరావుపేటలోని జెడ్‌పి బాలుర పాఠశాలలోని సోషల్ ఉపాధ్యాయురాలు సుహాసిని విద్యార్థులతో ఓర్పు సహనానికి మారుపేరుగా నిలిచారని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ సందర్భంగా సిహెచ్ సుహాసిని – నాగరాజు దంపతులను సహచర ఉపాధ్యాయులు, ఆత్మీయులు, ఎన్‌టిపిసి చర్చి సభ్యులు, జర్నలిస్టులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలుర, బాలిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్



ఠాగూర్, గంగాధర్ మాట్లాడుతూ 36యేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌టిబిసి చర్చి సభ్యులు ఎల్.సుధీర్ బాబు, చంద్రహాస్, మార్కు, జోషి, డేవిడ్‌పాల్, సాల్మన్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులను మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పిఎంఇజిపి రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొదల్కైన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జిఎం ప్రసాద్ వివరించారు. సమావేశంలో ఎపిఐఐసి జడ్‌ఎం శివకుమార్, డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, డిటిసి చందర్, ప్రింటింగ్ క్లస్టర్ నిర్వాహకులు బూదూరు మల్లికార్జున్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేశవరావు, కమిటీ సభ్యులు ఎపికె రెడ్డి, ఒమ్మిన సతీష్ పాల్గొన్నారు.

నగదు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-కావలి : శివరాత్రి సందర్భంగా మొగిలిచర్ల, లింగసముద్రం క్షేత్రాలకు కావలి డిపో నుండి 25 ప్రత్యేక బస్సులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయగా, కావలి డిపో సిబ్బంది విశేష కృషి చేసి కిలోమీటర్ కు రూ.54.19 ఆదాయం, బస్సుకు 105 సీట్ల భర్తీ శాతం సాధించారని శుక్రవారం డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదాయం, సీట్ల భర్తీలో మొదటి స్థానం సాధించిన కండక్టర్ పి.శ్రీనివాస్, డ్రైవర్ ఎస్‌కె.జలీల్, ద్వితీయ స్థానం సాధించిన కండక్టర్ కె.రాంప్రసాద్, డ్రైవర్ బి.కోదండయ్య తృతీయ స్థానం సాధించిన కండక్టర్ వై.శేఖర్ డ్రైవర్ ఎం.శ్రీనివాసులుకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం.కల్పనా రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్‌కె.ఖాదర్ మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, మార్కెటింగ్ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-కొడవలూరు : నార్త్ రాజుపాలెంలోని అంగన్‌వాడీ స్కూలు పరిధిలో ఉన్న బాలింతలకు గర్భిణులకు శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్ తువ్వర.ప్రసన్న పౌష్టికాహారం అందజేశారు. ఆ ప్రాంతంలో అంగన్‌వాడీ స్కూలుకు బిల్డింగ్ మంజూరు చేయాలని గిరిజన కుటుంబాలు స్థానిక ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పన

ప్రజాశక్తి-నెల్లూరు : రాబోయే ఆర్థిక సంవత్సరంలో మంచి నైపుణ్య శిక్షణిచ్చి ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యాం, డి ఆర్ డి ఎ పిడి నాగ రాజ కుమారి, బిసి,ఎస్సీ కార్పొరేషన్ ఇ డి ఏ. నిర్మలా దేవి, గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-కావలి



కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యం లో శుక్రవారం రెడ్‌క్రాస్ భవనంలో వేదిక పట్టణ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత న ఘనంగా సైన్స్ దినోత్సవ సభను నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ శ్రీరామ్ మనోహర్ బాబు, డాక్టర్ కె.ఆనంద్ కుమార్, డాక్టర్ పి.శివప్రసాద్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా గతవారం రోజులుగా జె.వి.వి. నిర్వహించిన సైన్స్ వారోత్సవాలలో జరిగిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ సమాజానికి సైన్స్ ఎంత అవసరమో వివరించారు. ఈ సందర్భంగా సీనియర్, జూనియర్ విభాగాల విద్యార్థులు ఫ్యాన్సీ డ్రెస్ (విచిత్ర వేషధారణ) పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి బాధ్యులు గాదిరెడ్డి హరనాథ్, టి.సుబ్బరామ శర్మ, జిల్లా నాయకులు పి.జానకిరామ్, జి.కళ్యాణి, చాకలకొండ శారద, గాదిరెడ్డి మురళికృష్ణ, రాజశేఖర్, కె.హరినారపరెడ్డి, షేక్.ఖాదర్ బాషా, ఎం.మాలకొండారెడ్డి, శ్రీకర్ల వెంకయ్య, ఎం.వి.ఎన్.ప్రసాద రావు, మొగిలిశెట్టి జమున, సత్యనారాయణ, ఎస్.రమణయ్య, చిట్టబత్తిన కల్లయ్య, కె.నారాయణ, సూరిశెట్టి రామచంద్రరావు, పట్టణంలోని 30 పాఠశాల లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : సమాజంలో శాస్త్ర విజ్ఞానం పెంపొందించుకొని దేశ అభివృద్ధికి తోడ్పడాలని సామాజికవేత్త మాలకొండా రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నరేంద్ర శ్యాం సుధాకర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో జాతీయ విజ్ఞాన సదస్సును ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక సెయింట్ మేరీస్, బిజ్జంపల్లి, వెంగళరావునగర్ పాఠశాలలో ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు ఉపాధ్యాయులతో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.తిరుపతి ప్రధానోపాధ్యాయులు షేక్ నూర్జహాన్, నాయబ్, సెయింట్ మేరీస్ ప్రిన్సిపాల్ సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : నేటి ఆధునిక సమాజంలో కూడా సైన్స్ ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక విశ్వతేజ పాఠశాలలో కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దొంతిరెడ్డి బిందురెడ్డి, ఉపాధ్యాయులు బాల నరసింహారెడ్డి, కిరణ్, ఖాజా మహబూబ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో 2025 పేరుతో భారీ ఎత్తున సైన్స్ ప్రాజెక్టను ప్రదర్శించడం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి అటల్ టింకరింగ్ స్కూల్స్ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ ఆర్ వి రమణారెడ్డి, సైన్స్ ఎక్స్పో-25 కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, ఎగ్జా, అన్ని విభాగాలు అధిపతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ పాఠశాల సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను ఎంఇఒ-2 వై.చెంచులక్ష్మమ్మ శుక్రవారం ప్రారంభించారు. అంతకముందు సి.వి.రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు టి.ఝాన్సీరాణి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.భారతి, డి.శైలజ, ఈ రాజేశ్వరి, తదితరులున్నారు

ప్రజాశక్తి నెల్లూరు : నెహ్రూ యువ కేంద్రం, పి ఆర్ ఆర్ అండ్ వి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నేషనల్ యూత్ వాలంటీర్ శరవణ , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్లోని శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం నాడు వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపల్ ఆవుల.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా మల్లికార్జున్, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హరికృష్ణ, గిరి, గీత, ఉమా మహేశ్వరి, కల్యాణి, సుమ, మహాలక్ష్మి, తులసి, సుమతీ, సన పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానిక స్ఫూర్తిని పెంపొందించుకుని వివిధ సాంకేతికతలపై పట్టు సాధించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నందీప్‌కుమార్ తెలిపారు. గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ సైన్స్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ పిఎం కిషోర్ పలు సూచనలు చేశారు. వివిధ పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-జలదంకి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ అయ్యల రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం సారథ్యంలో సైన్స్ కార్యక్రమాలు చాలా చక్కగా జరిగాయి. ఎంఇఒ సిహెచ్.నాగేశ్వర రావు విద్యార్థులనుద్దేశించి జాతీయ సైన్స్ దోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని జిల్లా రైతాంగానికి జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు విక్రయించుకునేందుకు జిల్లాలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు రూరల్ మండలం కలివెళిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు.

బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నూతనంగా ప్రవేశపెట్టబడిన ప్రమాద బీమా పథకాన్ని (జనరల్ ఇన్సూరెన్స్) తమ బ్యాంక్ ఖాతాదారులు ఉపయోగించుకోవాల్సిందిగా పట్టణ బ్రాంచ్ మేనేజర్ మహమ్మద్ మున్వర్ తెలియపరిచారు. గతంలో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని రెట్టింపు చేస్తూ నూతన విధి విధానాలతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వారు తెలిపారు. ఈ ప్రమాద బీమా పథకం ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులు ఏడాదికి రూ.2వేలు ప్రీమియం చెల్లిస్తే ఏడాదిపాటు ఈ పాలసీ వర్తింపు ఉంటుందని ఈ పాలసీ పొందినవారు పాలసీ పొందిన నాటి నుండి ఏడాదికాలం పాటు ఏదైనా ప్రమాదవశాత్తు మరణం సంభవించిన లేదా పూర్తిస్థాయి అంగవైకల్యం ఏర్పడిన యడల పాలసీదారుని కుటుంబానికి రూ.40 లక్షలు నగదును చెల్లిస్తారని తెలిపారు. ఈ పాలసీ పొందేందుకు బ్యాంకు సిబ్బందిని గానీ లేదా తనను గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక అల్లీపురం డంపింగ్ యార్డును మేయర్ స్రవంతి జయవర్ధన్ శుక్రవారం సందర్శించి వ్యర్థాల నిర్వహణ పనులను పర్యవేక్షించారు. మేయర్ మాట్లాడుతూ అల్లీపురం డంపింగ్ యార్డ్ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ కొంత మేరకు దెబ్బతిని కూలిపోయున్నందున, శిథిలమైనచోట అవసరమైన మేరకు గోడను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.